


www.aakshitha.com

People's voice

అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

# తెలంగాణ దిక్సూచి

శుక్రవారం | 05 | డిసెంబర్ | 2025 | పేజీలు: 08


# 'పది' మీ గమ్యానికి దిక్సూచి

విద్యతోనే మీ భవిత

విద్యార్థులకు క్యూఆర్ కోడ్ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ పంపిణీ

ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



మహబూబ్ నగర్, అక్షిత ప్రతినిధి: మహబూబ్‌నగర్ జిల్లా విద్యార్థులు అత్యున్నత విద్యా అవకాశాలను అందుకొని భవిష్యత్‌లో ప్రతిష్టాత్మక స్థానాలను సంపాదించాలని ఆకాంక్షిస్తూ, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తన స్వంత నిధులతో నిష్ణాతులైన అధ్యాపకుల బృందం చేత క్యూఆర్ కోడ్ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ ను తయారు చేయించి, నగరంలోని ..మిగతా 2లో




# ర్యాంకులే కాదు క్రీడలు అవశ్యం

## విద్యార్థి దశ నుంచే క్రీడలపై ఆసక్తి ఉండాలి

క్రీడలతో శారీరక దారుఢ్యం

పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరులో ఘనంగా ప్రారంభమైన నియోజకవర్గ స్థాయి ప్రైవేటు పాఠశాలల క్రీడా పోటీలు



**పటాన్‌చెరు, అక్షిత ప్రతినిధి :** ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలు ఎంతో అవసరమని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని మైత్రి మైదానంలో పటాన్‌చెరు ప్రైవేట్ రికగ్నైజ్డ్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి ప్రైవేట్ పాఠశాలల క్రీడా పోటీలను ఎమ్మెల్యే లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...విద్యార్థి దశ నుండి ..మిగతా 2లో

# రెండేళ్లైనా సీఎం ఫోటో మార్చరా...?

నిద్రమత్తు వీడని వనపర్తి వైద్య ఆరోగ్యశాఖ

దసరా పండుగ నుంచి బయో కెమిస్ట్రీ పరీక్షలకు తీవ్ర అంతరాయం

లక్షల రూపాయల ప్రజాధనంతో వెచ్చించిన జనరేటర్ నిరుపయోగం

తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రంపై అధికారుల పర్యవేక్షణ కరువు

సీఎం చిత్రపటంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలి

బీసీ పొలిటికల్ జెఎసి చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్

2





# పటిష్టవంతంగా ఎన్నికల ప్రక్రియ

ఎన్నికల సిబ్బందికి ర్యాండమైజేషన్

జిల్లా కలెక్టర్ హనుమంతరావు

**యాదాద్రి భువనగిరి, అక్షిత న్యూస్ :** ఎన్నికల నిబంధనలను పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి హనుమంతరావు అన్నారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ..మిగతా 2లో



# ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

పంచాయతీ ఎన్నికలపై ఎన్నికల కమీషనర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్

**ఖమ్మం/అక్షిత బ్యూరో:** పంచాయతీ ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించు కునేందుకు పోస్టల్ బ్యాలెట్ కు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్క ఎన్నికల సిబ్బందికి తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. పంచాయతీ ఎన్నికలపై రాష్ట్ర ..మిగతా 2లో



## ర్యాంకులే కాదు క్రీడలు అవశ్యం

**మొదటి పేజీ తరువాయి...**

క్రీడలపై ఆసక్తి పెంపొందిస్తే మానసిక వికాసం, శారీరక ధారుడ్యం లభిస్తుందని తెలిపారు. ర్యాంకుల మాయలో పడి క్రీడలను నిర్లక్ష్యం చేయవద్దని పాఠశాల యాజమాన్యాలకు, విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో క్రీడల అభివృద్ధికి ఎల్లప్పుడూ సంపూర్ణ సహకారం అందించడంతో పాటు, ఆధునిక వసతులతో స్టేడియాలు అందుబాటులోకి తీసుకొని వస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్ కుమార్, ట్రస్మా రాష్ట్ర కోశాధికారి రాఘవేంద్రరెడ్డి, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షులు సాయి తేజ, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎన్నికల సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్

**మొదటి పేజీ తరువాయి...**

ఎన్నికల కమీషనర్ రాణి కుముదిని నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. పంచాయతీ ఎన్నికల ఫలితాల ప్రకటన నియమాలు ఏకగ్రీవ స్థానాలలో ఉప సర్పంచ్ ఎన్నిక, పోస్టల్ బ్యాలెట్ ఏర్పాటు నామినేషన్లపై వచ్చే ఫిర్యాదులు తదితర అంశాల పట్ల ఎన్నికల కమిషనర్ రివ్యూ నిర్వహించి వార్డు సభ్యులంతా ఏకగ్రీవంగా ఎన్నికైన చోట ఉప సర్పంచ్ ఎన్నికలకు చర్యలు తీసుకోవాలని ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ పోస్టులకు సంబంధించి ఫలితాలు నిబంధనల ప్రకారం ప్రకటించాలని అన్నారు. అనంతరం అధికారులతో జిల్లా కలెక్టర్ అనుదుప్ దురిశెట్టి మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల పోస్టల్ బ్యాలెట్ వచ్చిన ప్రతి దరఖాస్తు పరిశీలించి తప్పని సరిగా అర్హులకు పోస్టల్ బ్యాలెట్ అందించాలని ప్రతి గ్రామం మండలాల వారీగా వివరాలు సేకరించి సంబంధిత రిటర్నింగ్ అధికారులు పోస్టల్ బ్యాలెట్ జారీ చేసేలా చూడాలని అన్నారు. మొదటి విడత పోలింగ్ జరిగే గ్రామాల్లో ఓటు హక్కు ఉండి ఎన్నికలు విధులు నిర్వహించే సిబ్బంది డిసెంబర్ 8 నాడు రెండవ విడత వారికి 12 నాడు మూడవ విడత వారికి 15 నాడు ఫెసిలిటేషన్ కేంద్రాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటు వేసేలా ఆదేశాలు జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద వెబ్ కాస్టింగ్ సెన్సిటివ్ పోలింగ్ కేంద్రాల వద్ద మైక్రో అబ్జర్వర్ నియామకం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, సిపిఓ ఏ శ్రీనివాస్ జిల్లా ఉపాధికల్పన అధికారి శ్రీరామ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పటిష్ట వంతంగా ఎన్నికల ప్రక్రియ



**మొదటి పేజీ తరువాయి...**

ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంత రావు, సాధారణ పరిశీలకులు గౌతమి, సమక్షంలో నిర్వహించారు. గురువారం వీసీ హాల్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను కలెక్టర్, సాధారణ పరిశీలకులు నిశితంగా పరిశీలించారు. జిల్లాలోని ఒక్కో మండలం వారీగా ఆలేరు, ఆత్మకూరు, బొమ్మలరామారం, రాజాపేట, తుర్కపల్లి, యాదగిరిగుట్ట ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపీఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. జిల్లాలోని 153 గ్రామ పంచాయతీల సర్పంచ్, 1286 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులు 1441, ఓ.పీ.ఓలు 1500 పోలింగ్ కోసం ర్యాండమైజేషన్ జరిపారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, డీపీఓ విష్ణు వర్ధన్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ ఎడి ప్రశాంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్లైనా సీఎం ఫోటో మార్చరా...?

**నిద్రమత్తు వీడని వనపర్తి వైద్య ఆరోగ్యశాఖ**

**దసరా పండుగ నుంచి బయో కెమిస్ట్రీ పరీక్షలకు తీవ్ర అంతరాయం**

**లక్షల రూపాయల ప్రజాధనంతో వెచ్చించిన జనరేటర్ నిరుపయోగం**

**తెలంగాణ డయాగ్నొస్టిక్ కేంద్రంపై అధికారుల పర్యవేక్షణ కరువు**

**సీఎం చిత్రపటంపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలి**

**బీసీ పొలిటికల్ జెఏసి చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్**



**వనపర్తి, అక్షిత ప్రతినిధి :** వనపర్తి జిల్లాలోని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు నిద్రమత్తు వీడటం లేదని బీసీ పొలిటికల్ జెఏసి స్టేట్ చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ మండిపడ్డారు. గురువారం జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రం వెనక వైద్య ఆరోగ్య శాఖ అధికారుల పర్యవేక్షణలో ఉన్న తెలంగాణ డయాగ్నొస్టిక్ డిస్ట్రిక్ట్ హబ్ ను జెఏసి నాయకులతో కలిసి సందర్శించారు. టీ హబ్ లో నెలకొన్న సమస్యలపై రాచాల విలేకరులతో మాట్లాడుతూ.... వైద్య ఆరోగ్యశాఖ అధికారులు టి హబ్ పై పూర్తిగా నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు అవుతున్నా... నేటికీ ఇంకా కెసిఆర్, హరీష్ రావులతో కూడిన ఫ్లెక్సీనే టీ హబ్ ముందు పెట్టడం దేనికి సంకేతం అని ప్రశ్నించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అంటే అధికారులకు లెక్క లేదా? లేక వివక్ష చూపుతున్నారా అని ఫైర్ అయ్యారు. టీ హబ్ వ్యవహారం చూస్తుంటే ప్రభుత్వాన్ని ప్రజల్లో బద్నాం చేయాలని టీ హబ్ అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కుమ్మక్కై చేస్తున్న కుట్రలా అనిపిస్తుందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. హబ్ లో ఎంతో అధునాతన బయో కెమిస్ట్రీ యంత్రం చెడిపోతే నెలలు గడుస్తున్నా కూడా మరమ్మత్తులు చేయించడం లేదని, ఫలితంగా ప్రజలు, రోగులు వైద్య పరీక్షల కోసం ప్రైవేట్ కేంద్రాలను ఆశ్రయించి జేబులు ఖాళీ చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కమిషన్ల కోసం కక్కుర్తి పడుతున్న కొందరు వైద్యుల వల్ల టీ హబ్ నిర్లక్ష్యానికి గురవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రూ. 17 లక్షల ప్రజాధనం వెచ్చించి ఏర్పాటు చేసిన జనరేటర్ కూడా నిరుపయోగంగా మారిందని, ప్రస్తుతం సిటీ స్కానింగ్ ఎక్సరేలు తీయాలంటే ఉన్న జనరేటర్ సామర్థ్యం సరిపోవడం లేదన్నారు.

కరెంటు పోతే టీహబ్ లో సేవలు నిలిచిపోయే దుస్థితి నెలకొందని, తక్షణమే ఈ హబ్ లోని బయో కెమిస్ట్రీ యంత్రాన్ని మరమ్మత్తులు చేసి, టీహబ్ కు అవసరమైన సామర్థ్యం కలిగిన జనరేటర్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి చిత్రపటాలపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని జిల్లా కలెక్టరును కోరారు. స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ ఉన్న నియోజకవర్గంలోనే ఈ విధంగా వివక్ష చూపడం అధికారుల విధుల నిర్లక్ష్యానికి నిదర్శనం అని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జెఏసి వనపర్తి పట్టణ అధ్యక్షుడు దేవర శివ, కొత్తకోట మండల అద్యక్షులు అంజన్న యాదవ్, శ్రీరంగాపూర్ మండల అద్యక్షుడు ధర్మేంద్ర సాగర్, చెలిమిల్ల రామన్ గౌడ్, నాగరాజు, రమేష్ గౌడ్, నరేందర్ సాగర్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# 'పది' మీ గమ్యానికి దిక్సూచి

**మొదటి పేజీ తరువాయి...**

మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గత రెండు సంవత్సరాలుగా ఉచితంగా అందజేస్తున్నారు. అందులో భాగంగా గురువారం ప్రభుత్వ న్యూ టౌన్ ఉన్నత పాఠశాల, బేసిక్ ప్రాక్టీస్ ఉన్నత పాఠశాల, మాడ్రన్ హైస్కూల్‌లలో విద్యార్థులకు ఈ క్యూఆర్ కోడ్ డిజిటల్ కంటెంట్ స్టడీ మెటీరియల్స్ ను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహబూబ్‌నగర్ వంటి అభివృద్ధి చెందుతున్న నగరాలకు విద్యే ప్రధాన శక్తి అని ఆయన అన్నారు. టెక్నాలజీ ఆధారిత విద్య ఇప్పుడు తప్పనిసరి అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థి కూడా సమాన అవకాశాలు పొందేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. మహబూబ్‌నగర్ అభివృద్ధి చెంది మహబూబ్‌నగర్ ఫస్ట్ స్థానంలో నిలవాలంటే ముందుగా మన పిల్లల భవిష్యత్తు బలపడాలని అన్నారు. ఆ బలం సంపాదించేది ఒక్క విద్య ద్వారానే సాధ్యమని చెప్పారు. విద్యార్థులు తమలోని ప్రతిభను గుర్తించి,





టార్గెట్ ఐఐఐటి లక్ష్యంగా పెట్టుకుని క్రమశిక్షణతో, నిబద్ధతతో ముందుకు సాగాలి" అని ఆయన అన్నారు. "పదవ తరగతి మీ జీవితంలో చిన్న అడుగు కాదని, మీ గమ్యాన్ని నిర్ణయించే కీలక దశ అని గుర్తించుకోవాలి అని ఆయన చెప్పారు. డిజిటల్ స్టడీ మెటీరియల్స్‌ను పూర్తిగా వినియోగించుకుని ప్రతిభను నిరూపించాలని, మీరు విజయాన్ని స్పష్టమైన లక్ష్యంతో కోరుకుంటే, దానిని సాధించే మార్గాలు స్వయంగా మీ ముందుకు వస్తాయి" అని ఆయన విద్యార్థులకు విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జీ గోనెల శ్రీనివాసులు, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేంధర్, వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకులు రవీందర్, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు మోసిన్, అంజద్, నాయకులు చందు యాదవ్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY




# సర్పంచ్ బరిలో నిలిచేవారు జాగ్రత్త

**ఇది పదవి కాదు అప్పుల ఊబి..!**

**ఖద్దరు చొక్కా వెనుక.. కన్నీటి గాథ**

**రాజకీయాల మోజులో జీవితాలు అతలాకుతలం**



**రామన్నపేట అక్షిత ప్రతినిధి:** గ్రామపంచాయతీ ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత కీలకమైనవిగా పరిగణిస్తారు. గ్రామాల్లో సర్పంచ్ ఎన్ని కలు మామూలు పోటీలు కావు. ఇది కేవలం అధికార పదవి కాదు మొత్తం గ్రామాన్ని నడిపించే బాధ్యత. అందుకే సర్పంచ్ బరిలోకి దిగేవారు ముందే జాగ్రత్తగా ఆలోచించాలి. గెలవడం ఒక్కటే లక్ష్యమైతే తర్వాత ఎదురయ్యే ఒత్తిడులు, అభివృద్ధి కష్టాలు భరించడం కష్టం.

**అభివృద్ధి చేసి.. అప్పుల ఊబిలో చిక్కి..**

గతంలో ఎన్నో గ్రామాల్లో సర్పంచులు తమ సొంత డబ్బులతో పెట్టుబడి పెట్టి రోడ్లు వేశారు, లైట్లు పెట్టించారు, కాలు వలు, భవనాలు నిర్మించారు. బిల్లులు రాక అప్పులు పేరుకుపోయి ఇబ్బందులు పడిన సంఘటనలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నాయి. ఒక్కో సర్పంచ్ సుమారు 15 నుంచి 20 లక్షల వరకు సొంతంగా ఖర్చు చేసిన ఉదాహరణలు ఉన్నాయి. కొన్ని చోట్ల ఈ అప్పుల భారం భరించ లేక, ఆత్మహత్యకు దిగిన ఘటనలు కూడా నమోదయ్యాయి. ఈ పరిణామాలు సర్పంచ్ బాధ్యతల భారాన్ని, ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్న జాప్యాన్ని అద్దం పడుతున్నాయి. పతనమ వుతున్న గ్రామాలను చూసిన మహాత్మా గాంధీ ఆశయం నేడు ప్రశ్నార్థకంగా మారింది.



**అభ్యర్థులు ఓటుకు నోటు ఇవ్వడం మానుకోండి..**

సర్పంచ్ అభ్యర్థులు గెలవడం కోసం ఓటర్లకు డబ్బులు, మద్యం, కాను కలు పంచే అలవాటుకు రాజకీయ నాయకులే బీజం వేశారు. దీనివల్ల నిజాయితీ, విలువలు ఉన్న వ్యక్తులు ఎన్నికల్లో నిలబడలేకపోతున్నారు. సర్పంచ్ బరిలో నిలిచే ప్రతి ఒక్కరూ ఈ విష వలయం నుంచి బయటపడ దాలని, నూతన శకానికి నాంది పలకాలని సామాజిక వేత్తలు పిలుపుని స్తున్నారు. అభ్యర్థులు బహిరంగంగా... నేను డబ్బులు ఇవ్వను. ఓట్లు కొనను. స్వచ్ఛందంగా గెలిపిస్తే గ్రామాన్ని అభివృద్ధి చేస్తాను అని ప్రజలకు హామీ ఇవ్వాలి. ప్రజల అభిమానాన్ని గెలుచుకుని, అందరినీ సమాన త్వంతో చూస్తానని, అందుబాటులో ఉంటానని భరోసా ఇవ్వాలి. ప్రస్తుత ఈ ఎన్నికల విధానంలో ఈ మార్పు రావాల్సిన ఆవశ్యకత ఉంది.

**ఓటు అమ్ముకుంటే ప్రశ్నించే హక్కు కోల్పోతారు...**

ఓటర్లు కూడా ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కు విలువను గుర్తించాలి. నోటుకు, మందు బాటిళ్లకు, బిర్యానీలకు మీ ఓట్లను అమ్ముకుంటే, ప్రశ్నించే హక్కును మీరే కోల్పోతారని ప్రజలు గ్రహించాలి. డబ్బులు తీసు కోకుండా ఓటు వేస్తే... గ్రామంలో ఏదైనా సమస్య వస్తే, ఈ సమస్యను ఎందుకు పరిష్కారం చేస్తలేవని గట్టిగా నిల దీసే హక్కు మీకు ఉంటుంది. ప్రజలు డబ్బులు తీసు కోము అని ప్రతిజ్ఞ పూని, డబ్బులివ్వని మంచి వ్యక్తులను ఎన్నుకుంటేనే గ్రామంలో నిజమైన మార్పు సాధ్యమవుతుంది.

**పదవి ఒకరిది... పెత్తనం మరొకరిది...**

ఎన్ని చట్టాలు వచ్చినా, గ్రామాల్లో ఇంకా పెత్తందారీ కులాలదే రాజ్యం, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల వారు సర్పంచ్లు అయితే, తెర వెనుక నుండి పెత్తందారులు నడిపిస్తున్నారు. ఇక మహిళలు సర్పంచ్లు అయితే వారి భర్తలే అధికారం చెలాయిస్తున్నారు. నామమాత్రపు సర్పంచ్లతో గ్రామ స్వరాజ్యం కల ఎలా సాకారమవుతుంది?

**2025 సర్పంచ్ ఎన్నికలు మార్పుకు నాంది కావాలి**

ఈ సారి గ్రామాల్లోని యువతీ, యువకులు, మహిళలు అందరూ ఆలో చించి ఓటు వేయాల్సిన అవసరం ఉంది. మన అభ్యర్థి.. విలువలు ఉన్న వాడా.. చదువుకున్నావాడా..? అభివృద్ధి చేసే సామర్థ్యం ఉన్నదా? అనే ప్రశ్నలు వేసుకోవాలి. సరైన వ్యక్తిని ఎన్నుకోవాలి. గ్రామాల్లో మంచి నాయకులు ఎదిగితేనే జిల్లా, రాష్ట్ర, దేశానికి మంచి నాయకులు వస్తారు. ఈ ఎన్నికలు మార్పుకు నాంది పలకాలి.

# రోశయ్య సేవలు చిరస్మరణీయం

**సబ్ కలెక్టరేట్‌లో మాజీ సీఎం రోశయ్యకు నివాళులు**



**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి :** ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కె.రోశయ్య వర్ధంతిని స్థానిక సబ్ కలెక్టరేట్ లో గురువారం నిర్వహించారు. ఆయనవి చిత్రపటానికి సబ్ కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాస్ శర్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు.కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ రాములమ్మ, ఆర్ఐ జె.రామకృష్ణయ్య, జూనియర్ అసిస్టెంట్ ఎండీ.జమాల్, బిందు తదితరులు పాల్గొన్నారు.

# పదోన్నతులతో పాటు బాధ్యతలు పెరుగుతాయి సిపి



**వరంగల్, అక్షిత బ్యూరో:** పదోన్నతులతో పాటు బాధ్యతలు కూడా పెరుగుతాయని సీపీ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆర్మడ్ విభాగం ఏ. ఆర్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్లు గా పొందిన మల్లారెడ్డి, సాధిక్ అలీ,బీర్ దేవ్ లు గురువారం వరంగల్ పోలీస్ కమిషనర్ మర్యాదపూర్వకంగా కలుసుకొని పుష్పాగుచ్చాలను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ అధికారులు అప్పగించిన పనులను సమర్థవంతంగా పూర్తి చేయడంతో పాటు పోలీస్ శాఖకు పేరు ప్రతిష్ట పెంచే విధంగా విధులు నిర్వహించాలని సీపీ తెలిపారు.

# నామినేషన్ సెంటర్స్ ని పరిశీలించిన ఏసీపి వసుంధర యాదవ్ ఐపీఎస్...




**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సత్తుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రుద్రాక్షపల్లి, గంగారం, బేతుపల్లి గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ సెంటర్స్ ను కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్ విజిట్ చేసి విధులలో ఉన్న సిబ్బందికి నామినేషన్ సెంటర్స్ దగ్గర డ్యూటీ లో పాటించాల్సిన నియమాల గురించి సూచనలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి ఎస్ హెచ్ ఓ తుమ్మలపల్లి శ్రీహరి మరియు సెక్టార్ ఎస్సై వీర ప్రసాద్ ఉన్నారు.

# ఖబర్దార్ జీవం లేని రెడ్డి అలియాస్ శ్రీ రెడ్డి

**బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు దొండి రమణ**



**ఆర్మూర్, అక్షిత ప్రతినిధి :** అయ్యా జీవన్ రెడ్డి ఖబర్దార్ కోతికి కొబ్బరి చిప్ప ఇస్తే ఎంత సంతోషంగా ఉంటదో నీకు ఒక మైకు దొరికితే నువ్వు కూడా అలాగే ఉంటావు ప్రతిరోజు ఆర్మూర్ లో ఏది పడితే అది మాట్లాడతా అంటే ఇక్కడ ఎవ్వడు ఊరుకోడు గుర్తుపెట్టుకో బిడ్డ స్థానిక ఎన్నికల్లో ఏదో ప్రలోభాలు పెట్టాలని చూస్తున్నావు నీ గురించి ఆర్మూర్ ప్రజలందరికీ తెలుసు నువ్వు ఆర్మూర్ నియోజకవర్గంలో చేసిన అక్రమాలు అన్నీ ఇన్ని కావు ఏది ఎంత దొరికితే అంత తిన్నవాడివి. నీవు మాట్లాడితే దయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉంటది ఇప్పటికైనా నోరు అదుపులో పెట్టుకుని ఉండు కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడే కనీస అర్హత కూడా నీకు లేదు నీకు నీ అయ్యా కేసీఆర్ అలాగే నేర్పించాడు కాబట్టే నీవు ఈ రోజు ఇలాగ మాట్లాడుతున్నావ్. నోరు అదుపులో పెట్టుకోకపోతే కాంగ్రెస్ కార్యకర్తలు అందరూ కలిసి నిన్ను ఆర్మూర్ లో అడుగుపెట్టనివ్వరు గుర్తుపెట్టుకో కాంగ్రెస్ పార్టీ అంటే ఒక క్రమశిక్షణ కలిగిన పార్టీ అందుకనే ఇంత మౌనం పాటిస్తున్నాము కాంగ్రెస్ పార్టీ అంటే ఒక సముద్రం మేము పార్టీ లైన్ దాటితే నువ్వు ఆ ధాటికి తట్టుకోలేవు మళ్లీ ఆర్మూర్లో ఏదో చేద్దామని ఊహా గణాల్లో ఉన్నావు నిన్ను కింది స్థాయి నుండి కూడా ఎవ్వరు నమ్మే పరిస్థితిలో లేరు నీ వెనకాల ఉండే నలుగురు తొత్తులతో కలిసి ఏదో మార్నింగ్ వాక్ పేరుతో పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నావ్. మీరు నాటిన మొక్కలు మానవళికి ఎంత ప్రమాదమో తెలుసు అయినా మీరు డబ్బులకు కక్కుర్తి పడి అట్టి చెట్లను నాటినారు అందుకనే మా ప్రభుత్వం వచ్చిన తర్వాత అట్టి చెట్లను నరికి వేయడం జరిగింది నీవు ఏదో ఫాల్తూ మాటలు చెప్పి ప్రజలను ప్రలోభాల పాలు చేద్దామంటే ఎవ్వరు కూడా నమ్మే పరిస్థితిలో లేరు నువ్వు రానున్న రోజుల్లో నిన్ను ఆర్మూర్లో తిరగనీయకుండా చేస్తాం ఖబర్దార్ జీవన్ రెడ్డి నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడు నీ జనతా గ్యారేజ్ ప్రజలను మంచి చేయడానికి వాడు నీ జనతా గ్యారేజ్ కి నీ బాధితులని పంపిస్తాము నువ్వు ఎందరిని ముంచినావో వాళ్లే నీ ఇంటిని ముట్టడి చేస్తారు అతి త్వరలో అది గుర్తుపెట్టుకో శనివారం తోపారం భగత్ అంబేద్కర్ చౌరస్తానందు నిరసన కార్యక్రమాన్ని తెలుపుతున్నాడు దానికి బీసీ సెల్ తరపున మా పూర్తి మద్దతు తెలుపుతాము అని బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు దొండి రమణ తెలిపారు.

# స్థానిక సంస్థల ఎన్నికల బరిలో భారతీయ జనతా పార్టీ



మహాదేవపూర్,అక్షిత ప్రతినిధి: స్థానిక సంస్థల ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని భారతీయ జనతా పార్టీ స్థానిక బరిలో నిలిచి తమ సత్తా చాటేందుకు ప్రయత్నం చేస్తుంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ గ్రామ సర్పంచి బరిలో భారతీయ జనతా పార్టీ తరపున ఆశావాహులు నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. దీంతో మూడు ప్రధాన పార్టీల మధ్య స్థానిక పోరు ఆసక్తికరంగా జరగనుంది. తెలంగాణ రాష్ట్రంలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిజెపి ఒంటరిగానే పోటీ చేయాలని నిర్ణయించుకున్న విషయం విధితమే. అందుకు కార్యాచరణ మొదలుపెట్టి,వార్డులు గ్రామపంచాయతీ స్థానాలలో తమ అభ్యర్థులను నిలబెట్టాలని రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇతర పార్టీలతో పొత్తు పెట్టుకోకుండానే ఒంటరిగానే బరిలోకి దిగింది.బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పిలుపు మేరకు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేసి,కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ఎండగట్టి, కేంద్రం గ్రామపంచాయతీలకు అందిస్తున్న నిధులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని భావిస్తుంది. ఇందుకు అధికార కాంగ్రెస్ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలకు దీటుగా నామినేషన్ల ప్రక్రియ మొదలుపెట్టింది. ఎలాగైనా స్థానికంగా గెలవాలనే లక్ష్యంతో ముందుకు వెళుతుంది. యువత చూపు కొత్తదనాన్ని కోరుకుంటున్న తరుణంలో బిజెపి స్థానిక ఎన్నికల్లో పోటీ చేస్తే గెలిచే అవకాశాలు కూడా లేకపోలేదని చర్చ జోరుగా జరుగుతుంది. లోక్ సభ ఎన్నికల్లో సత్తా చాటిన ఆత్మవిశ్వాసంతో స్థానిక ఎన్నికల్లో కూడా సత్తా చాటి బిఆర్ఎస్ పార్టీని మూడో స్థానానికి నెట్టివేయాలని బిజెపి లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తున్నది.మొత్తానికైతే మూడు ప్రధాన పార్టీలలో మహాదేపూర్ సర్పంచి పీఠం ఎవరిని వరిస్తుందో వేచి చూడాలి.

# కరీంనగర్ కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు సరోజ కన్నుమూత






కరీంనగర్ టౌన్, అక్షిత న్యూస్ : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు, జిల్లా మాజీ అధ్యక్షురాలు ఆళ్ల సరోజ (80) గురువారం అనారోగ్యంతో కన్నుమూశారు. గత 25 ఏళ్లపాటు 2024 వరకు అంజని మహిళా సూపర్ బజార్ చైర్మన్‌గా సేవలందించిన ఆమె, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సీనియర్ నాయకురాలిగా ప్రత్యేక గుర్తింపు పొందారు. స్వర్గీయ పి. వెంకటస్వామి, ఎం. సత్యనారాయణ రావు వంటి కీలక నాయకులతో కలిసి పనిచేసిన సరోజ సేవలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు స్మరించుకున్నారు. ఆమె మృతి పట్ల పలువురు నేతలు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కరీంనగర్ కార్పొరేషన్ అర్బన్ డిసిసి అధ్యక్షుడు డాక్టర్ అంజన్ కుమార్ ఆమె పార్థివ దేహంపై కాంగ్రెస్ జెండాను కప్పి ఘన నివాళులు అర్పించారు.

# హిల్ట్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం

**తెలంగాణను దోచుకుంటున్న దండుపాళ్యం ముఠా**

**దేశ చరిత్రలోనే అతిపెద్ద రియల్‌ఎస్టేట్ కుంభకోణం**

**రైతులకు వెంటనే రాష్ట్ర ప్రభుత్వం న్యాయం చేయాలి**

**మాజీమంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్**

**పాశమైలారం పారిశ్రామికవాడలో బీఆర్ఎస్ నేతల పర్యటన**

పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి: హిల్ట్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుందని మాజీమంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ విమర్శించారు. హైదరాబాద్ మహానగర ప్రాంతంలో హిల్ట్ ప్రాజెక్ట్ పేరుతో రూ.5 లక్షల కోట్ల విలువైన పారిశ్రామిక భూములను ప్రైవేట్ వ్యక్తులకు బదిలీ చేయాలనే కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రను అడ్డుకునేందుకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఆదేశాల మేరకు పటాన్‌చెరు నియోజకవర్గంలోని పాశమైలారం పారిశ్రామికవాడలో బీఆర్ఎస్ పార్టీ నేతలు ప్రత్యేక పర్యటన నిర్వహించారు.

గురువారం పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ ఆదర్శ్ రెడ్డి,మాజీ జడ్పీటీసీ గడీల శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పర్యటనలో మాజీమంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్,ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్,సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్,జహీరాబాద్ ఎమ్మెల్యే మనిక్‌రావు,డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, మాజీ బెవరేజెస్ చైర్మన్ దేవి ప్రసాద్,మాజీ ఎస్టీ,ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోల్ల శ్రీనివాస్ లు పర్యటించారు.తమ చేతుల్లో తెలంగాణను దోచుకుంటున్న దండుపాళ్యం ముఠా అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ హిల్ట్ పాలసీ రద్దు చేయాలని నినాదాలు చేశారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ...పటాన్‌చెరు ప్రాంతంలో మొత్తం 1,188 ఎకరాలు,పాశమైలారం పారిశ్రామికవాడలో 1,495 ఎకరాలు,మొత్తం కలిపి 2,708 ఎకరాల పారిశ్రామిక భూములను హిల్ట్ పేరిట మోసం చేస్తుందని ధ్వజమెత్తారు.కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రయోజనాలను నిర్వీర్యం చేసే కుట్రలో భాగంగా హిల్ట్ పాలసీని తెచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇది దేశ చరిత్రలోనే అతిపెద్ద రియల్‌ఎస్టేట్ కుంభకోణమని పేర్కొన్నారు. పటాన్‌చెరు,పాశమైలారం పరిశ్రమలను తరలిస్తే వేలాది మంది కార్మికులు నిరుద్యోగులవుతారని






ఆందోళన వ్యక్తం చేశారు.కాలుష్య రహిత పరిశ్రమలపైనా ప్రభుత్వం బలవంతపు తరలింపులకు సిద్ధమవుతోందని విమర్శించారు. హిల్ట్ పాలసీ అమలు చేస్తే బీఆర్ఎస్ పార్టీ పెద్దఎత్తున ప్రజా ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం హిల్ట్ పాలసీపై పట్టుబడితే ఆదిలో రైతుల నుంచి రూ.3,000 ఎకరాకు కొనుగోలు చేసిన భూముల్లో కనీసం 50 శాతం రైతులకు తిరిగి ఇవ్వాలని అన్నారు.ఇంకా కోర్టుల్లో న్యాయం కోసం పోరాడుతున్న రైతులకు ప్రాధాన్యతతో పరిష్కారం ఇవ్వాలని తెలిపారు.లేకపోతే ఆ భూములను ప్రజల ప్రయోజనాల కోసం ప్రభుత్వం పూర్తిగా అభివృద్ధి చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పటాన్‌చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్,జిన్నారం మాజీ జెడ్పీటీసీ బాల్ రెడ్డి,తెల్లాపూర్ మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోరు రసవత్తరం.. తీరు ఆసక్తికరం

**మమ్మల్ని ఆదరిస్తే ఈ బాగోగులు చూస్తాం**

**ఓటర్లకు అభ్యర్థుల విన్నపం**



వలిగొండ/అక్షిత న్యూస్: గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించిన రెండవ విడత నామినేషన్ల స్వీకరణ పూర్తయింది.ప్రచార ఘట్టం ప్రారంభమైంది. దీంతో మండలంలో పల్లెపోరు రసవత్తరంగా మారింది. సర్పంచి గా గెలిచేందుకు ఉవ్విళ్లూరుతున్న ఒక్కో అభ్యర్థి ఒక్కో పంథా అవలంబిస్తున్నారు. ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి కొందరు సామాజిక మాధ్యమాలను విరివిగా వినియోగించుకుంటే.. మరికొందరు 'నేను ఇవి చేసి చూపిస్తా'నంటూ బాంఢ్ పేపర్లు రాసిస్తున్నారు.

**సహాయ కార్యక్రమాలతో.. ముందుకు వస్తున్న అభ్యర్థులు**

ఓటర్లకు చేరువ అయ్యేందుకు ఇప్పటివరకు తాము చేపట్ట బోయే సేవాకార్యక్రమాలను ఓటర్లకు సామాజిక మాధ్యమాల ద్వారా వివరిస్తున్నారు. స్టేటస్ వేదికగా.. మరికొందరు సర్పంచి అభ్యర్థులు వాట్సప్ స్టేటస్ లను తమ ప్రచార వేదికగా మలుచుకుంటున్నారు. ప్రజలకు తాము ఏం చేస్తామో వివరిస్తూ స్టేటస్లో పెడుతున్నారు. ఓటర్లకు దగ్గరయ్యేలా తమ ఫొటోలు, వీడియోలకు పాటలు, సంగీతం జతచేస్తున్నారు. బంధువులు, మిత్రుల వాట్సప్ గ్రూప్ , ఫేస్బుక్, ఇన్స్టాగ్రాంలో షేర్ చేస్తూ ప్రచారం చేసుకుంటున్నారు. సొంత మేనిఫెస్టోతో.. ఓటర్ల మద్దతు కూడగట్టుకునేందుకు మండలకేంద్రంలో పోటీ చేస్తున్న ఓ యువకుడు సొంత మేనిఫెస్టోను తెరపైకి తీసుకొచ్చారు. తాను గెలిస్తే ప్రజలకు నిస్వార్థంగా పనిచేస్తానని హామీ ఇస్తున్నారు. అక్రమ ఆస్తులు కూడబెట్టనని, అలా సంపాదిస్తే అవన్నీ ప్రజలకే చెందుతాయంటూ రూ.100 విలువైన బాండ్ పేపర్ పై రాసి ఓటర్లకు వివరిస్తున్నారు.

# ఎన్నికల్లో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకం

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**





వనపర్తి, అక్షిత ప్రతినిధి : ఎన్నికలు స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరం లో గురువారం మైక్రో అబ్జర్వర్లకు నిర్వహించిన శిక్షణకు ఎన్నికల సాధారణ పరిశీలకులు మల్లయ్య భట్టు, వ్యయ పరిశీలకులు శ్రీనివాస్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు యాదయ్య తో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికలు స్వేచ్ఛయుత వాతావరణంలో నిర్వహించడంలో మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని అన్నారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ ప్రక్రియను పరిశీలన చేయడమే కీలకమని, అలాకాకుండా పిఓలు ఏపీఓల విధుల్లో జోక్యం చేసుకోరాదని చెప్పారు. పోలింగ్ ప్రక్రియ ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం జరుగుతుందా లేదా పరిశీలన చేయడం మైక్రో అబ్జర్వర్ల ప్రధాన బాధ్యత అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికల పోలింగ్ నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉంటే అబ్జర్వర్లకు తెలియజేయాల్సిన బాధ్యత మైక్రో అబ్జర్వర్లపై ఉంటుందన్నారు. మైక్రో అబ్జర్వర్లు పోలింగ్ విధానాన్ని పరిశీలిస్తూ ఎలాంటి తప్పిదాలు ఉల్లంఘనలు జరిగిన ఎన్నికల పరిశీలకుల దృష్టికి తీసుకుపోవాలన్నారు. పోలింగ్ విధానాన్ని నిశితంగా పరిశీలించి మైక్రో అబ్జర్వర్లకు ఇచ్చిన ఫార్మట్‌లోనే నివేదిక సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. పోలింగ్ రోజున ఉదయం 6:00 కల్లా మైక్రో అబ్జర్వర్లు నిర్దేశించిన పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. మైక్రో అబ్జర్వర్లు తాము ఫిల్ చేయాల్సిన చెక్ లిస్ట్ ను చాలా జాగ్రత్తగా పూర్తి చేయాలని సూచించారు. మైక్రో అబ్జర్వర్ పరిధిలో ఎన్ని పోలింగ్ కేంద్రాలు ఉంటే అన్ని చెక్ లిస్ట్ లు సమర్పించాల్సి ఉంటుందని తెలియజేశారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు మల్లయ్య బట్టు మాట్లాడుతూ పోలింగ్ ప్రక్రియ నిర్వహణలో మైక్రో అబ్జర్వర్లు ఎన్నికల కమిషన్ తరపున కళ్ళు చెవుల లాగా పనిచేయాలని సూచించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికల పోలింగ్ నిర్వహణకు మైక్రో అబ్జర్వర్ల పాత్ర కీలకమని పరిశీలకులు తెలియజేశారు. సమావేశంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివకుమార్, ట్రైనర్ శ్రీనివాసులు, డిప్యూటీ సీఈఓ రామ మహేశ్వర్, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పొగ మంచుతో అప్రమత్తత అవసరం

**నల్గొండ జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్**



నల్గొండ టౌన్, అక్షిత న్యూస్ : చలి కాలం నేపథ్యంలో పొగమంచు వలన ప్రయాణం సమయంలో రోడ్డు పైన వాహనాలు, పాదచారులు, జంతువులు, మరియు సిగ్నల్స్ సరిగ్గా కనిపించవు. ఈ కాలంలో డ్రైవర్లు ముందు ఉన్న వాహనాలు,ఆగి ఉన్న వాహనాలు ఎంత దూరం ఉన్నాయో అంచనావేయడం కష్టం అవుతుంది. ఈ చలి కాలంలో డ్రైవర్లు జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలను నివారించవచ్చును. ప్రమాదాల నివారణకు ఈ క్రింద తెలిపిన సూచనలు పాటిస్తూ గమ్యాన్ని చేరుకోవాలి. గమ్యస్థానానికి వెళ్ళవలసిన క్రమంలో కొద్దిగా ముందుగానే బయలుదేరండి. పొగమంచు వలన ఆలస్యం అయ్యే ప్రమాదం ఉంది కనుక ముందుగా బయలుదేరితే డ్రైవింగ్ చేస్తున్నప్పుడు తొందరగా వెళ్ళాలనే ఆలోచనను నివారించవచ్చు. అతివేగాన్ని మరియు ఓవర్ టేకింగ్ నివారించండి ముందుగా ఉన్న వాహనాలు మరియు రోడ్డు కనిపించకపోవడం వలన మరియు వేగంగా వెళ్ళడం వలన వాహనం కంట్రోల్ తప్పే ప్రమాదం మరియు ఓవర్ టేకింగ్ వలన ముందున్న వాహనం ఎంత దూరంలో ఉందో అంచనావేయడం కష్టం. లోబీమ్ లైట్లను వాడండి పొగ మంచు వలన హై బీమ్ లైట్ల నుండి వచ్చే కాంతి విచ్ఛిన్నమై ముందు చూడడం కష్టం అవుతుంది. లోబీమ్ లైట్లు ఉండటం వలన వెనుక లైట్లు, మిగతా వాహనదారులకు క్లియర్ గా మీ వాహనం ఎంత దూరంలో ఉందో తెలుస్తుంది. ఫాగ్ లైట్లు ఉన్న యెడల, వాటిని వాడవలసినదిగా విజ్ఞప్తి. ముందు ఉన్న వాహనానికి మీ వాహనానికి మధ్య సురక్షిత దూరాన్ని ఉంచండి. దాని వలన ముందున్న వాహనం సడన్ బ్రేక్ వేసినా మరియు వాహనం ఎక్కడ ఉందో అంచనా వేయడంలో తప్పు జరిగినా, ముందున్న వాహనాన్ని ఢీకొట్టడాన్ని నివారించవచ్చు. నిర్దేశించబడిన లేన్లలో వాహనాన్ని నడపండి. ఇష్టం వచ్చినట్లు లేన్ క్రమశిక్షణ లేకుండా నడపడం వలన ముందున్న వాహనాలను గుర్తించడం కష్టం అవుతుంది. వాహనాన్నినడిపేటప్పుడు కొద్దిగా కిటికీ అద్దాలను దించండి. అద్దాలను దించడంవలన పొగమంచు ఒకేదగ్గర కేంద్రీకృతం కాకుండా విచ్ఛిన్నం అవుతుంది. దాని వలన డ్రైవర్ దృష్టి మెరుగు పడుతుంది. కొన్నిసార్లు పొగమంచు ఎక్కువ ఉన్న ప్రాంతాలలో కాసేపు వాహనాన్ని ఆపి మరల వాహనాన్ని నడపండి మీకు ముందు ఉన్న వాహనాలు, రోడ్డు సరిగ్గా కనిపించకపోతే వాహనాన్ని నడపవద్దు. లేనియెడల ముందున్న వాహనం ఎంతదూరం ఉందో అంచనా వేయడం కష్టం. గమ్యస్థానానికి వెళ్ళే తొందరలో తప్పులు చేయవద్దు. మీ వాహనం ముందు కిటికీ అద్దాలను వెనుక ఉన్న అద్దాలను శుభ్రంగా ఉంచుకోండి పొగమంచు అద్దాలను కవర్ చేయడం వలన దృష్టి తగ్గుతుంది. మీ వాహనం యొక్క వైపర్లను, డీఫ్రాస్టర్లను అవసరాన్ని బట్టి వాడుతూ అద్దాలను క్లియర్ గా ఉంచండి. ముందుగా ఇన్డికేటర్లను ఉపయోగించండి మీరు ఏటువైపు వెళుతున్నారో వెనుక వచ్చే వాహనానికి ముందుగా తెలిసేటట్లు జాగ్రత్త తీసుకోండి. లేని యెడల వెనుక వచ్చే వాహనం ముందున్న వాహనం ఏటు వెళుతుందో అంచనావేయడంలో తప్పు చేయవచ్చు. వెనుక వచ్చే డ్రైవర్లకు కొంత సమయం ఉండేటట్టు ఇండికేటర్లతో సిగ్నల్ ఇవ్వండి. సడన్ బ్రేకింగ్ వేయడాన్ని నివారించండి. చలికాలంలో రోడ్డు తడిగా ఉండటంవలన వాహనాలు స్కిడ్ అవడం మరియు స్లిప్ అవ్వడం జరుగుతుంది. నిర్దిష్ట స్పీడ్ తో వాహనాలను నడపడం వలన, స్లిప్పరీ రోడ్ల నుండి వాహనాలు స్కిడ్ కాకుండా నివారించవచ్చు. సడన్ బ్రేక్ లు వేయడం వలన స్లిప్పరీ రోడ్ మీద వాహనం అదుపు తప్పేప్రమాదముంది. అందుచేత బ్రేక్ లను నెమ్మదిగా అప్ప్లయ్ చేయండి. నల్గొండ జిల్లా ఎస్పీ ఒక ప్రకటనలు తెలిపారు.

## బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



వనపర్తి, అక్షిత ప్రతినిధి : వనపర్తి జిల్లా ఖిల్లా ఘణపురం మండల పరిధిలో ఇటీవల పొలం వద్ద ప్రమాదవశత్తు జారి పడడంతో తుంటిలో విరిగిపోయి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బోయ దేగలి బుచ్చన్న కుటుంబాన్ని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి పరామర్శించారు. బుచ్చన్నతో మాట్లాడి ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. గత నాలుగు రోజుల క్రితం మృతి చెందిన జాన్మీయా కుటుంబాన్ని ఎమ్మెల్యే పరామర్శించారు. జాన్మియా మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యంతో ఇటీవల మృతి చెందిన భారతి కుటుంబాన్ని సైతం ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా భారతి మృతికి గల కారణాలను భర్త గోపాల్ తో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆ గ్రామస్తులతో మాట్లాడి ఎన్నికల ప్రచార నీకు సంబంధించిన అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వెంకట్రావు, సాయి చరణ్ రెడ్డి, లింగం, నరసింహారెడ్డి, దానయ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కొణిజేటి సేవలు చిరస్మరణీయం

**కాంగ్రెస్ నాయకులు**



కరీంనగర్ టౌన్, అక్షిత్ న్యూస్ : దివంగత మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య నాల్గవ వర్ధంతి సందర్భంగా, జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ నాయకులు కంకణాల అనిల్ కుమార్ గుప్తా ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి కోడూరు చైర్మన్ నరేందర్ రెడ్డి హాజరై, రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మరియు అనిల్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, రోశయ్య రాష్ట్ర ముఖ్యమంత్రిగా, తమిళనాడు గవర్నర్‌గా, ఆర్థిక శాఖ మంత్రిగా వంటి పలు అత్యున్నత పదవులను చేపట్టి, ఆ పదవులకే వన్నె తెచ్చారని కొనియాడారు. ఆయన చేసిన సేవలను స్మరించుకుంటూ, ఆయన చూపిన బాటలో నడవాలని కాంగ్రెస్ నాయకులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రావణ నాయక్, కొర్వి అరుణ్ కుమార్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, సలీముద్దీన్, అబ్దుల్ రెహమాన్, అనిల్, కోడూరు రవీందర్ గౌడ్, దన్నా సింగ్, మామిడి అందశంకర్, తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించండి

**మాజీ ఎమ్మెల్యే కిషోర్ ఆదేశాలతో 13 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో**

**కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించండి**

**బిఆర్ఎస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను ఆశీర్వదించండి**

**బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కల్లేట్లపల్లి ఉప్పలయ్య**







నాగారం అక్షిత న్యూస్ : మండలంలోని 13 గ్రామ పంచాయతీల బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల అధికారిక ప్రకటన. నాగారం మండల రాజకీయ దశను ప్రభావితం చేసే కీలక నిర్ణయంగా, బిఆర్ఎస్ పార్టీ బుధవారం 14లో 13 గ్రామ పంచాయితీల సర్పంచ్ అభ్యర్థుల జాబితాను అధికారికంగా ప్రకటించింది. మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి, తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిషోర్ కుమార్ ల ఆదేశాల మేరకు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కల్లెట్లపల్లి ఉప్పలయ్య నేతృత్వంలో సాగిన ఈ ప్రక్రియలో గ్రామస్తుల అభిప్రాయాలు, స్థానిక నాయకుల సూచనలు, గత ఎన్నికల తరహా మద్దతు వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి అభ్యర్థుల ఎంపిక జరిగింది. ప్రకటించిన అభ్యర్థుల వివరాలు ఇలా ఉన్నాయి, నాగారం గుంటకండ్ల రామచంద్రారెడ్డి, ఫణిగిరి అందె సంధ్యారాణి సైదులు, ఈటూరు అంబటి రేణుక నాగయ్య, వర్ధమానుకోట తెలుసూరి నర్సయ్య, పసునూరు పొదిల సుభద్ర నరేష్, పస్తాల వడ్లకొండ రాములు, లక్ష్మాపురం జాటోత్ దేవేందర్ నాయక్, డి. కొత్తపల్లి దందోలు సుమతి యాదగిరి, మామిడిపల్లి కనుకు శ్రీను, మాచిరెడ్డిపల్లి బుషిపాక సుమతి అంజయ్య, నరసింహులగూడెం తరాల కవిత అంజి, పేరబోయిన గూడెం దొడ్డి ప్రేమయ్య, నాగారం బంగ్లా ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో బిఆర్ఎస్ మద్దతుతో గద్దం ఉప్పలయ్య లు బిఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కల్లెట్లపల్లి ఉప్పలయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర నిర్మాణం కొరకు బిఆర్ఎస్ పార్టీ నాయకత్వం చేసిన త్యాగాలు, ఉద్యమాలు, బిఆర్ఎస్ ప్రభుత్వం గత పది సంవత్సరాల కాలంలో రాష్ట్రంలో అమలుచేసిన అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, గ్రామీణ జీవనోపాధిని బలోపేతం చేశాయని తెలిపారు. తెలంగాణ వనరులను వలసవాదుల నుండి కాపాడిన పార్టీ ధోరణి, ప్రజా సమస్యలను పరిష్కరించే విధానాలు, ప్రజల్లో నమ్మకం నింపాయని అన్నారు. నేటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ మళ్లీ గ్రామాలలో, రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీ నాయకత్వంమే రావాలని, ప్రజలు ఆశీర్వదిస్తారని, గ్రామాల అభివృద్ధి జరగాలంటే గ్రామ పునాది నుండి రాష్ట్రం వరకు బిఆర్ఎస్ నాయకత్వం ఉండాలని, అది ప్రజల నుండే చైతన్యం రావాలని, సర్పంచ్ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

## కుటుంబ సమేతంగా గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి



పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి: గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ను ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి కుటుంబ సమేతంగా కలిశారు. గురువారం లోక్ భవన్ లో గవర్నర్ ను ఆయన సతీమణి, బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరితో పాటు వారి కుటుంబ సభ్యులతో అంజిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం గవర్నర్ కు పూల బొకే అందించి ఘనంగా సన్మానించారు. ఇటీవల ఎమ్మెల్సీ కుమారుడి వివాహం జరగగా, గవర్నర్ తన వ్యక్తిగత కారణాలతో హాజరు కాలేదు. ఈ క్రమంలో గవర్నర్ స్వయంగా నూతన వధూవరులను ఆహ్వానించి, శుభాకాంక్షలు తెలిపి వారిని ఆశీర్వదించారు.

## సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ సర్పంచ్ అభ్యర్థిగామెచ్చు దేవరాజు...



**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** సత్తుపల్లి మండలం రేగళ్ల పాడు పంచాయతీ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ బలపరిచిన అభ్యర్థి మెచ్చు దేవరాజు సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ వేయడం జరిగింది. పార్టీ డివిజన్ కార్యదర్శి వర్గ సభ్యులు అమర్లపూడి శరత్, డివిజన్ నాయకులు కొరసా వెంకటేష్, మెచ్చు నాగేష్, జవ్వాజి భద్రమ్, తదితరులుపాల్గొన్నారు.

## యువతకు ఉచిత శిక్షణ ఉపాధి కల్పన

**నల్గొండ టౌన్, అక్షిత న్యూస్ :** తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎన్ఏసి నేషనల్ కన్స్ట్రక్షన్ వారిచే యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పన చేస్తున్నట్లు నల్లగొండ జిల్లా ఎన్ఏసి అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్ రమేష్ తెలిపారు. 18 సంవత్సరముల నుండి 35 సంవత్సరములు కలిగిన ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని నిరుద్యోగ యువతకు ల్యాండ్ సర్వేయర్ సూపర్వైజర్ స్ట్రక్చర్ ఎలక్ట్రీషియన్ టైలరింగ్ కోర్సుల్లో యువతి యువకులకు 90 రోజుల ఉచిత శిక్షణ ఇవ్వబడును మరియు అనంతరము సర్టిఫికెట్ తో పాటు 100 శాతం ఉపాధి కల్పిస్తామన్నారు. ఇట్టి శిక్షణను సద్వినియోగం చేసుకోగలరని వారు కోరారు శిక్షణ సమయంలో స్టేషనరీ యూనిఫామ్, హెల్మెంట్, హ్యాండ్ బ్యాగ్ ఉచితముగా ఇవ్వబడును మరిన్ని వివరాలకు న్యాక్ ఎన్ ఏ సి ఆఫీస్ గౌట్ ఐటీయా కాలేజ్ ప్రాంగణంలో డైట్ కాలేజ్ పక్కన కలెక్టరేట్ దగ్గర మిర్యాలగూడ రోడ్ నల్గొండ యందు సంప్రదించగలరు. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్: 7893332674, 8297431655, 8498065139 దరఖాస్తు చేయుటకు చివరి తేదీ: 13 డిసెంబర్ 2025 శిక్షణ తరగతులు ప్రారంభం తేదీ: 15 డిసెంబర్ 2025

## 15 పోలీస్ బెటాలియన్ లో ఘనంగా మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి







**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** గురువారం తేదీ 04%-12-%2025 న 15వ బెటాలియన్ బి.గంగారం సత్తుపల్లి నందు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వర్ధంతి వేడుకలను కమాండెంట్ ఎన్. పెద్దబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది , ఈ సందర్భంగా బెటాలియన్ పోలీస్ అధికారులు,సిబ్బంది రోశయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రోశయ్య ప్రజాసేవ ,రాజకీయ ప్రస్థానం, పరిపాలన నైపుణ్యాలను స్మరించుకుంటూ అధికారులు ,సిబ్బంది అందరూ రెండు నిమిషాలు నిశ్శబ్ద ప్రార్థన నిర్వహించారు. కమాండెంట్ రోశయ్య విలక్షణ సేవలను గుర్తు చేసుకుంటూ ప్రజల పట్ల కర్తవ్యం పరిపాలనలో ఆయన చూపిన నిబద్ధతను స్ఫూర్తిగాతీసుకోవాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికిఅదనపుకమాండెంట్ ఎ.అంజయ్య,అసిస్టెంట్ కమాండెంట్ లు యస్. శ్రీధర్ రాజా, వేణుగోపాల్ రెడ్డి ,ఆర్ఐ లు ,ఆర్.ఎస్. ఐ లు మరియు బెటాలియన్ పోలీస్ సిబ్బంది అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని ఘనవిజయం చేయడం జరిగింది.

# వరంగల్ ఆయుర్వేద దవాఖానకు జబ్బు చేసింది

**గత రెండు సంవత్సరాలుగా మందులు, వైద్యం అందించలేని పరిస్థితి**

**ఆయుర్వేద వైద్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు, ప్రభుత్వ విధానాలు**




**వరంగల్, అక్షిత బ్యూరో:** వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద దవాఖాన కు తీవ్ర జబ్బు చేసింది గత రెండు సంవత్సరాలుగా అనారోగ్యంతో మంచం ఎక్కింది దవాఖానకు వైద్యం చేయలేక సిబ్బంది తలక్రిందులవుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఆయుర్వేదాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే ఆలోచనలో ఉన్నట్టున్నది అందుకే పూర్తిస్థాయిలో రెండు సంవత్సరాలు కావస్తున్న ఆయుర్వేద దవాఖానను చికిత్స చేయడం లేదు.

**మందులు ఇవ్వడం లేదు**

వివిధ ప్రాంతాల నుంచి వరంగల్ ఆయుర్వేద దవాఖానికి వస్తున్న నిరుపేదలకు తూతూ మంత్రంగా వైద్యం చేస్తూ కాలం గడిపేస్తున్నారు. అదేమని అడిగితే ప్రభుత్వం పూర్తిస్థాయిలో మాకు మందులు ఇవ్వడం లేదు వైద్యులను గాని సిబ్బందిని గాని ఇవ్వడం లేదని చెబుతున్నారు. కనీసం దీర్ఘ వ్యాధులతో వస్తున్న షుగర్, థైరాయిడ్, బిపి, కీళ్ల నొప్పులు, పక్షవాతం, నరాల వ్యాధి, శస్త్ర చికిత్సలు వంటివి, ఆయుర్వేదంలో అనేకమైన వ్యాధులను నయం చేసే వైద్యం ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో వైద్యం అందించలేక సిబ్బంది లేక మందులు ఇవ్వకుండా వివిధ వ్యాధులతో వస్తుందని నిరుపేద రోగులకు ఏమాత్రం వైద్యం అందించకుండా నిర్లక్ష్యం చేస్తూ కాలం గడుపుతున్నారు. ఆసుపత్రికి వస్తున్న రోగులకు 4,5 రకాల మందులు అవసరం ఉన్న కేవలం ఒక రకం మాత్రమే ఇచ్చి బయట తీసుకోవాలని సూచిస్తున్నారు. వైద్యం కోసం వస్తున్న రోగులకు వైద్యులు పూర్తిస్థాయిలో లేక అన్ని రకాల జబ్బులకు కొంతమంది వైద్యులే సూచనలిస్తూ వారిని పంపిస్తున్నారు.

**ఆయుర్వేదం మూసేస్తారా**

ప్రభుత్వ విధానం చూస్తుంటే రెండు సంవత్సరాలుగా ఆయుర్వేదం మందులు కానీ వైద్యం గాని అందించని పరిస్థితిని చూస్తుంటే ఆయుర్వేదాన్ని పూర్తిస్థాయిలో మూసివేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లుగా కనిపిస్తుంది. ఎందుకంటే అల్లోపతి వైద్యంలో ఎక్కువ శాతం ఫీజులు రావటం వచ్చునని అల్లోపతి మందులకు ఎక్కువ ఖరీదవుతుందని ఆయుర్వేదం వల్ల ప్రైవేట్ వైద్యానికి ఎటువంటి లాభం లేదని దానికి అనుగుణంగా ఆయుర్వేద వైద్యాన్ని ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నట్లుగా గత రెండు సంవత్సరాల కు పైగా మందులు దొరకగా వైద్యం అందగా ఆయుర్వేదం పట్ల మక్కువ పెంచుకున్న రోగులు వాపోతున్నారు.

ప్రభుత్వం వైద్యశాఖ ఆయుష్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆయుర్వేదాన్ని ప్రధాన స్రవంతిలో మిగతా ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు ఆయుర్వేద వైద్యం కూడా పూర్తిస్థాయిలో ఆయుర్వేదాన్ని నమ్ముకున్న రోగులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆరోగ్య శాఖ దీని పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఆయుర్వేదాన్ని నిర్వీర్యం చేయకుండా భారతీయ ప్రాచీన వైద్యాన్ని వెలుగులోకి తీసుకురావాలని ఇతర రాష్ట్రాల్లో ఆయుర్వేదమే ప్రధాన వైద్యం గా ఉన్నందున అక్కడి ప్రజలు క్షేమంగా సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా జీవిస్తున్నారని దానిని దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రభుత్వం కూడా ఆయుర్వేద వైద్యాన్ని సిబ్బందిని పెంచి ఆయుర్వేదం పట్ల ప్రజలకు ఉన్న నమ్మకాన్ని మమ్ము చేయకుండా ఆధునిక ప్రాచీన వైద్యాన్ని ఆదుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# కార్మికులకు వ్యతిరేకమైన 4 లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

**సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అతిమేల మానిక్**

**లేబర్ కోడ్స్ రద్దు చేయకపోతే కేంద్ర ప్రభుత్వాన్నికి గుణపాఠం తప్పదు**

**సిఐటియు రాష్ట్ర 5వ మహాసభలను జయప్రదం చేయండి**

**డిసెంబర్ 7న మెదక్ లో కార్మిక ప్రదర్శన బహిరంగ సభ**




**పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి:** కార్మికులకు వ్యతిరేకమైన 4 లేబర్ కోడ్స్ రద్దు అయ్యే వరకు పోరాటం ఆగదని,లేనిపక్షంలో కేంద్ర బిజెపి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ అన్నారు.సిఐటియు తెలంగాణ రాష్ట్ర 5వ మహాసభలు మెదక్ పట్టణంలో డిసెంబర్ 7 నుండి 9 వరకు జరగతున్న సందర్భంగా గురువారం పాశమైలారం పారిశ్రామిక వాడలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు అతిమేల మానిక్ 2కె రన్ ను జెండా ఊపి ప్రారంభించారు. కిర్బీ చౌరస్తా నుండి బిపిఎల్ వరకు రన్ జరిగింది. ఈ సందర్భంగా అతిమేల మానిక్ మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్స్ తో కార్మికులు కట్టు బానిసలుగా మారుతారని తెలిపారు. కార్మికుల హక్కులపై మోడీ ప్రభుత్వం కత్తి పెట్టి సవారిచేస్తుందని అన్నారు. కార్మికులకు వ్యతిరేకమైన లేబర్ కోడ్స్ ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.లేబర్ కోడ్స్ ను కార్మికులు ఐక్యంగా ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు.సిఐటియు రాష్ట్ర మహాసభల్లో 33 జిల్లాల నుండి కార్మిక పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న ప్రతినిధులు పాల్గొంటున్నారని,డిసెంబర్ 7న జరిగే కార్మిక ప్రదర్శన బహిరంగ సభకు ముఖ్యఅతిథిగా సిపిఎం పోలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు,అఖిలభారత అధ్యక్షురాలు డాక్టర్ హేమలత, ప్రధాన కార్యదర్శి తపన్సేన్, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పాల్గొంటున్నారని అన్నారు. రాష్ట్రంలో కార్మికులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ పోరాటాలకు ప్రణాళిక రూపొందించుకోవడం జరుగుతుందన్నారు. ఈ మహాసభలను కార్మికులు ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఈ సందర్భంగా కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.నాగేశ్వరరావు, నాయకులు రాజు తలారి, శ్రీనివాస్,వెంకటేష్,శేఖర్ రెడ్డి, నాగరాజు,నవీన్,ప్రవీణ్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

www.aakshitha.com
People's voice
అక్షిత
AKSHITHA NATIONAL DAILY



# పంచ భూతాలే ప్రామాణికంగా వంటిల్లే వైద్యశాలగా సంపూర్ణ ఆరోగ్యం

ఆయుర్వేదం నాడీ వైద్యం

ఆక్యూ పంక్చర్ ప్రకృతి వైద్యం

మొండి వ్యాధులకు గంటల్లో ఉపశమనం కలిగిస్తున్న వైద్యుడు పిసి వీరాస్వామి

ఆయుర్వేదం తో అద్భుతాలు చూస్తున్నామంటున్న బాధితులు

ఖమ్మం వత్సవాయిలో క్లినిక్ లు

భారీగా క్యూ కడుతున్న బాధితులు





**ఖమ్మం/అక్షిత బ్యూరో :** ఇప్పుడు మన ఖమ్మం నగరం జమ్మిబండ సమీపంలో ఆయుర్వేదం నాడీ వైద్యం

ఆక్యూ పంక్చర్ ప్రకృతి వైద్య సేవలను వైద్యుడు పిసి వీరస్వామి సేవలందిస్తున్నారు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి తమ జబ్బులను నయం చేసుకునేందుకు బాధితులు క్యూ కడుతున్నారు. డాక్టర్ పిసి వీరస్వామి అతి తక్కువ కాలంలో ప్రాచుర్యం పొందారు.

భారతీయ ప్రాచీన వైద్యం గురించి వినటమే కానీ చూసింది లేదు. కేవలం నాడీ పట్టుకొని మన శరీరంలోని వాత పిత్త కఫ దోషాలను కనిపెట్టి మనం ఎలాంటి వ్యాధులతో లేదా అనారోగ్యాలతో బాధపడుతున్నామో అప్పటి వైద్యులు దగ్గరుండి చూసినట్లే చెప్పేవారు. రాను రాను ఎక్స్ రేలు స్కానింగ్ లు వచ్చాయి. మన ఒంట్లోని వ్యాధిని కనిపెట్టడానికి బోలెడు టెస్ట్ లు రక్త పరీక్షలు వచ్చాయి. అయినా సరే రిపోర్ట్ లన్నీ నార్మల్ వచ్చాయి కానీ జబ్బు అంతుబట్టడం లేదు అని బాధపడే వారు కోకొల్లలు ఆధునిక జీవన శైలిలో మనం తీసుకునే ఆహారం సమయ పాలన లేకపోవటం ఒత్తిళ్లు తగినంత నీరు తీసుకోకపోవడం మనిషి ఆరోగ్యంపై ఎంతో ప్రభావాన్ని చూపిస్తున్నాయి. దాంతో శరీరంలోని వ్యవస్థల పట్ల సమన్వయం లోపించి వ్యాధులకు దారితీస్తోంది. అయితే అప్పటి ప్రాచీన నాడీ వైద్యాన్ని ఇప్పుడు ఖమ్మం లో అందిస్తున్నారో ఆయుర్వేద సిద్ధ వైద్యుడు అక్యుపంక్చర్ అక్కు ప్రెజర్ నాడీ థెరపీ నేచర్ క్యూర్ ఆయుర్వేదిక్ వంటి భారతీయ వైద్య విధానాల ద్వారా దీర్ఘ కాలిక స్వల్ప కాలిక సీజనల్ వ్యాధులన్నీ నయం చేస్తున్నాడు.ఖమ్మం జిల్లా నుండే కాక నల్గొండ సూర్యాపేట మహబూబాబాద్ వరంగల్ ఎన్టీఆర్ జిల్లా పరిసర జిల్లాల వాసులు ఆయన వద్దకు క్యూ కడుతున్నారు.

**అసలు ఏమిటీ వైద్య శాస్త్రం..**

మనిషి శరీరంలో 10 ఆర్గాన్స్ 12 మెరిడియన్స్ ఉంటాయి. వీటికి సమానంగా ప్రాణశక్తి అందాలి. వీటికి ప్రాణ శక్తి అందనప్పుడే జబ్బులు వస్తాయి. ఆక్యుపంక్చర్ ఆక్యు ప్రెజర్ చేసినప్పుడు అవి ప్రాణశక్తిని పొంది తిరిగి బ్యాలన్స్ అవుతాయి. మనిషి శరీరంలో లక్షలాది నాడులు ఉంటాయి. వాటిని సమన్వయం చేసేవే వాత పిత్త కఫ నాడులు నాడీ పట్టుకొని చూస్తే ఆ నాడీ కి ఏ దోషం ఉందో దానితో శరీరంలో ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నాయో అర్థమవుతుంది. దాన్ని బట్టి చేసేదే నాడీ థెరపీ.

**నాడీ దోషాలు**

మనిషిలో ఉండే వాత పిత్త కఫ దోషాలు మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయి. వాత దోషం ఉన్నప్పుడు 86 రకాల వ్యాధులు మనిషిని చుట్టు ముడతాయి. పిత్త దోషం ఉన్నప్పుడు 40 రకాల జబ్బులు వస్తాయి. కఫ దోషం వల్ల 32 రకాల అనారోగ్య సమస్యలు వస్తాయి. నాడీ థెరపీ ద్వారా ఈ దోషాలు నయం చేయవచ్చు.

**మనిషి శరీరం లోను పంచ భూతాలు..**

ప్రకృతిలో ఉండే పంచ భూతాలు మనిషి శరీరం లోను ఉంటాయి.గాలి నీరు భూమి ఆకాశం మానవ శరీరంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. మనిషి శరీరంలో 70 శాతం నీరు ఉంటుంది. వాయువు 60 నుండి 70 శాతం ఉంటుంది. మానవుడి శరీణానికి అగ్ని తత్వం ఆకాశం లాంటి శూన్యం. భూమికి అయస్కాంతతత్వం ఉంటుంది. పంచ భూతాలకు అనుగుణంగా కోట్లాది జీవులు జీవిస్తుంటే మనిషి మాత్రం అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నాడు అందుకే ఈ వ్యాధులన్నీ ప్రకృతిలో ఏ జీవి అయినా పూర్తిగా అరిగే వరకు మళ్ళీ తినవు. కానీ మనిషి తింటాడు. మనిషి శరీరం డస్ట్ బిన్ గా మారడం వల్లే వ్యాధులు వచ్చేది. మిగతా జీవులు సరిపడా నీళ్లు తాగుతాయి కానీ మనిషి దాహం వస్తేనే నీళ్లు తాగుతారు. దాహం వేసే వరకు ఉండడం వల్ల శరీరంలో కొన్ని కణాలు చనిపోయాయి. అదీ అనారోగ్యానికే దారి తీస్తుంది. మనిషికి సూర్యరశ్మి సరిగా అందకపోవడం వల్ల శరీరం వేడిని బ్యాలన్స్ చేయక పోవడం వల్ల కొన్ని అనారోగ్య సమస్యలకు దారితీస్తాయి.

**పంచ భూతాలకు అనుగుణంగా మానవుడు జీవించాలి**

పంచభూత శత్యాన్ని కలిగి ఉన్న మనిషి పంచభూతాలకు అనుగుణంగా జీవించాలి.

ఆహారం మితంగా తీసుకోవాలి. వారానికి ఒక్కసారైనా ఉపవాసం ఉండాలి. అప్పుడే బాడీ సర్వీసింగ్ అవుతుంది. సరైన ఆహారం మితాహారం సరిపడ నీరు పరిశుభ్రమైన గాలి సరిపడ వెల్తురు తగినంత విశ్రాంతి ఆరోగ్యకర జీవనానికి దోహద పడతాయి.

ప్రకృతి వైద్యం..

ఏ మనిషి ఎంత పరిణామంలో నీటి ని తీసుకోవాలనే దానికి ఒక లెక్క ఉంది. మనిషి బరువు లో 6/100 నిష్పత్తిలో నీటిని తాగాలి. అదే బ్యాలెన్సింగ్ వాటర్ ఆహారం తీసుకోవడానికి అర గంట ముందు ఆహారం తీసుకున్న 40 నిమిషాల తర్వాత అర లీటర్ చొప్పున నీరు తాగాలి. తర్వాత ప్రతి అరగంటకు అర లీటర్ చొప్పున తీసుకోవాలి.సరైన పద్ధతిలో ఆహారం తినక పోవడం వల్ల అనారోగ్యం వస్తుంది. తిన్నాక శక్తి రావడానికి బదులు నిద్ర వస్తుందంటే ఆలోచించాల్సిందే. దీన్ని నియంత్రించుకోవడమే ప్రకృతి వైద్యం. అయితే ఈ పరిస్థితుల నుండి వచ్చిన జబ్బులను నయం చేయడానికి కొన్ని ఆయుర్వేద మందులను వాడాలి తక్కువ సమయంలో అతి తక్కువ ఖర్చుతో 3 నెలల్లో ఎలాంటి దీర్ఘకాలిక వ్యాధులనయినా తగ్గింద వచ్చు.

షుగర్ థైరాయిడ్ ల క్యాన్సర్ మోకాళ్ల నొప్పులు సయాటికా కిడ్నీ లివర్ పార్కెన్ సన్ పీసీఓడీ పిసిఓఎస్ పక్షవాతం తెల్లబట్ట అధిక రక్తస్రావం డిస్క్ గ్యాస్ అధికబరువు సైనస్ వంటి వాటిని తక్కువ సమయంలో గుట్టేస్తే వెంటనే పరిష్కరించే అవకాశం ఉంది.

ప్రస్తుతం శుక్ర శని ఆదివారాల్లో ఖమ్మం లో సోమ, మంగళ వారాల్లో వత్సవాయిలో బుధ గురు వారాల్లో హైదరాబాద్ లలో సేవలు అందిస్తున్నాం.

## అభ్యర్థులకు మార్గ నిర్దేశం




**ఆత్మకూర్(ఎం)అక్షిత న్యూస్:** మండల కేంద్రంలో ఆయా గ్రామపంచాయతీ ఎలక్షన్ లో పోటీ చేయు సర్పంచ్,వార్డు మెంబర్ లకు గ్రామ పంచాయితీ మినీ ఫంక్షన్ హాల్,ఆత్మకూర్ యం ఏర్పాటుచేసిన అవగాహన సమావేశమునకు ఎలక్షన్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్, శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని పోటీ చేసే అభ్యర్థులకు మార్గ నిర్దేశం చేసినారు,ఈ కార్యక్రమంలో బి వేణు మండల్ ఎలక్షన్ ఎక్స్పెండిచర్ అబ్జర్వర్, ఎంపీడీవో రాములు నాయక్, తాసిల్దార్ లావణ్య,డిప్యూటీ తాసిల్దార్ సఫియుద్దిన్,శ్యామ్ కుమార్ యంపిఓ,లోకేశ్వర్ రెడ్డి పర్యవేక్షకులు,స్టేజ్ వన్ రిటర్నింగ్ ఆఫీసర్స్, అభ్యర్థులు,పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## రిటర్నింగ్ అధికారి భిన్న వైఖరి

ఎన్నికల నామినేషన్ ప్రక్రియలో

రిటర్నింగ్ అధికారి (ఆర్ ఓ)




**మహాదేవపూర్ అక్షిత ప్రతినిధి:** భిన్న వైఖరిని ప్రదర్శించారు. నిష్పక్ష పాతంగా, చట్టబద్దంగా విధులు నిర్వహించాల్సిన అధికారి గురువారం మహాదేవపూర్ గ్రామపంచాయతీలో స్థానిక సంస్థల సర్పంచి అభ్యర్థుల నామినేషన్ స్వీకరణలో ద్వంద్వ వైఖరిని ప్రదర్శించారు. నామినేషన్ వేసే సమయంలో అభ్యర్థుల ఫోటోలు తీయద్దంటూనే అధికార పార్టీ సర్పంచి అభ్యర్థి నామినేషన్ వేసేందుకు రాగా వారికి ఫోటో తీసే వెసులుబాటు కల్పించారు. ఓవైపు ప్రెస్ కు సంబంధించి అనుమతి లేదంటూనే మరోవైపు అధికార పార్టీ అభ్యర్థి ఫోటోలకు అనుమతించడంపై ప్రజలు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. అధికార పార్టీకి ఓ న్యాయం, ప్రతిపక్షాలకు, ప్రజలకు,మీడియాకు మరో న్యాయమా..? అంటూ మండిపడుతున్నారు. దీనిపై ఎన్నికల సంఘం, జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


## అంగరంగ వైభవంగా స్వర్ణగిరీశుడి నిత్య కళ్యాణం



**భువనగిరి /అక్షిత న్యూస్:** స్వర్ణగిరి దివ్య క్షేత్రంలో గురువారం స్వర్ణ గిరి శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి పట్టు పితాంభరాలు ధరింపజేసి నవరత్న ఖచ్చిత స్వర్ణభరణాలతో పరిమళభరిత పుష్ప అలంకరించి శ్రీ స్వామివారి నిత్య కళ్యాణ మహోత్సవాన్ని అర్చక స్వాములు అంగరంగ వైభవంగా నిర్వహించారు భక్తులు శ్రీ స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని కనుల పండుగగా తిలకించారు గురువారం కూడా పలువురు ప్రముఖులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

## మియాపూర్‌లో అయ్యప్ప స్వామి మహా పడిపూజ .. పాల్గొన్న ప్రముఖులు..

**శేరిలింగంపల్లి అక్షిత ప్రతినిధి:** మియాపూర్‌లో రాచమల్ల ఓం ప్రకాశ్ గౌడ్ అధ్వర్యంలో అయ్యప్ప స్వామి మహా పడిపూజ కార్యక్రమం కు వారి కుటుంబ సభ్యుల ఆహ్వానం మేరకు యలమంచి ఉదయ్ కిరణ్ టీం సభ్యులు పాల్గొని స్వామివారి దివ్య ఆశీర్వాదాలు పొందారు. భక్తజనుల కోసం ప్రత్యేకంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమ ప్రాంగణంలో భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొనడంతో ఆధ్యాత్మిక వాతావరణం మరింత వైభవోపేతంగా మారింది. భక్తి, శ్రద్ధ, సేవ భావనలతో కార్యక్రమం



శ్రద్ధగా నిర్వహించబడింది.

ఈ సందర్భంగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జ్ , టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ బండి రమేష్, యలమంచి ఉదయ్ కిరణ్ అలాగే బాలకృష్ణ , నాగుల్ పటేల్ , రాచమల్ల కృష్ణ పటేల్ , వీరేందర్ గౌడ్ , రాచమల్ల భాస్కర్ గౌడ్ , రామకృష్ణ గౌడ్ , తాండ్ర రాంచందర్ గౌడ్ , గోపాల్ , గోకినేపల్లి రమేష్, కామినేని వాసు తదితర ప్రముఖులు పాల్గొని కార్యక్రమాన్ని మరింత విశిష్టంగా నిలిపారు.కార్యక్రమం సమగ్రంగా, శ్రద్ధగా నిర్వహించబడటం పట్ల భక్తజనులు ఆనందం వ్యక్తం చేశారు. ఆధ్యాత్మికత, సమాజ సేవ, సమన్వయం విలువలను ప్రతిబింబించిన ఈ వేడుక మియాపూర్ ప్రాంతంలో ప్రత్యేకంగా నిలిచింది.

## జీడిమెట్లలో బిఆర్ఎస్ నిరసన సందర్భంగా విషాదం

**ఆజ్‌తక్ కెమెరామెన్ దామోదర్ గుండెపోటుతో మృతి**



**అక్షిత న్యూస్ / గాజులరామారం:** జీడిమెట్ల పరిశ్రమల ప్రాంతంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన నిరసన ర్యాలీలో విషాద సంఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీకి వ్యతిరేకంగా చేపట్టిన ఈ ర్యాలీలో మీడియా ప్రతినిధిగా విధులు నిర్వహిస్తున్న ఆజ్‌తక్ ఛానల్ సీనియర్ కెమెరామెన్ దామోదర్ ఆకస్మికంగా వాంతులు చేసుకుంటూ కుప్పకూలారు. గుండెపోటు వచ్చినట్లు అనుమానించడంతో అక్కడే ఉన్న పోలీసు సిబ్బంది, పార్టీ కార్యకర్తలు వెంటనే అతన్ని సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. కానీ, ఆసుపత్రి చేరుకునేలోపే దామోదర్ ప్రాణం కోల్పోయినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ దుర్ఘటనతో నిరసన ర్యాలీపై విషాద ఛాయలు అలుముకున్నాయి. సీనియర్ కెమెరామెన్ అకస్మిక మరణం పట్ల మీడియా వర్గాలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశాయి. ఎమ్మెల్యే వివేకానంద మాట్లాడుతూ దామోదర్ మరణం మీడియా రంగానికే కాకుండా ర్యాలీలో పాల్గొన్న అందరికీ తీవ్ర మానసిక వేదనను మిగిల్చిందని, ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అటు ఎమ్మెల్సీ శాంభీపూర్ రాజు కూడా దామోదర్ మరణంపై సంతాపం వ్యక్తం చేస్తూ మృతుడి కుటుంబానికి ఆ భగవంతుడు ధైర్యం ఇవ్వాలి" అని ఆకాంక్షించారు అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టెమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు .

## గొర్రెల చోరీలకు పాల్పడుతున్న ముఠా అరెస్టు



**వరంగల్, అక్షిత బ్యూరో:** గ్రామీణ ప్రాంతాల్లో గొర్రెల దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు నిందితులతో పాటు వీరికి సహకరించిన మరో నిందితుడిని గీసుగొండ పోలీసులు అరెస్టు చేసారు. వీరి నుండి పోలీసులు సుమారు 1,60,000 (లక్ష అరవై వేల రూపాయలను) రూపాయల నగదును స్వాధీనం చేసుకున్నారు.

**పోలీసులు అరెస్టు చేసిన నిందితుల వివరాలు:**

1.బాదవత్ సాయి చరణ్ ఆలియాస్ సిద్దు, వయస్సు 19, ముగ్దుంపురం, నర్సంపేట, వరంగల్ జిల్లా,

2.యం.డి గౌస్ పాషా, వయస్సు 18, పోచమ్మమైదాన్, వరంగల్.

3. కోట విశ్వతేజ, వయస్సు 18, కాశీబుగ్గ, వరంగల్.

4. రాయపురం సాయి, వయస్సు 23, ఇల్లందు, వర్ధన్నపేట, వరంగల్ జిల్లా.

5. అంగడి వెంకన్న, వయస్సు 45, ఇల్లందు, వర్ధన్నపేట, వరంగల్ జిల్లాకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు.

నిందితులను పట్టు కోవడంలో ప్రతిభ కనబరిచిన గీసుగొండ ఇన్స్పెక్టర్ డి. విశ్వేశ్వర్, ఎస్.ఐ కె. కుమార్, కానిస్టేబుళ్ళు విజయ్, అరవింద్, సాయి, హరి, రజని కుమార్ మరియు ఇతర సహకరించిన సిబ్బందిని మామూనూర్ ఏసీపీ అభినందిస్తూ తగిన శాఖపరమైన ప్రోత్సాహకాలు అందిస్తామని తెలియజేశారు

# జీ.పీ ఎన్నికల పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్

**వరంగల్, అక్షిత బ్యూరో:** గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బంది మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు బాలమాయాదేవి, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ సత్య శారద ల సమక్షంలో గురువారం నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల వీ.సీ హాల్ లో ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరిస్తూ ర్యాండమైజేషన్ జరిపించారు. ఈ ప్రక్రియను సాధారణ పరిశీలకులు, కలెక్టర్ లు







నిశితంగా పరిశీలించారు.

జిల్లాలోని వరంగల్, నర్సంపేట రెవెన్యూ డివిజన్లలోని ఒక్కో మండలం వారీగా ఆయా గ్రామ పంచాయతీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓ.పీ.ఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని, ర్యాండమైజేషన్ ద్వారా స్థానికేతర సిబ్బందిని పోలింగ్ విధుల కోసం ఎంపిక చేశారు. జిల్లాలోని 317 గ్రామ పంచాయతీల సర్పంచ్, 2754 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ స్టాఫ్ కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులతో పాటు, ఓ.పీ.ఓల ర్యాండమైజేషన్ జరిపారు.

ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, జెడ్పి సీఈఓ రామిరెడ్డి, డీపీఓ కల్పన, తదితరులు పాల్గొన్నారు.

## రూపకల్పన పరంజాలపై అవగాహన

**క్షేత్ర సందర్శనలో ఆచరణాత్మక అనుభవాన్ని పొందిన గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులు**



**పటాన్‌చెరు అక్షిత ప్రతినిధి:** నిర్మాణంలో కాంక్రీటుకు కావలసిన ఆకారాన్ని ఇవ్వడానికి ఉపయోగించే ఫార్మ్ వర్క్ (రూపకల్పన),నిర్మాణ పనులలో ఎత్తులో ఉన్న ప్రదేశాలకు చేరడానికి,పనిముట్లు కార్మికులకు ఇవ్వడానికి ఉపయోగించే పరంజాల గురించి గీతం ఆర్కిటెక్చర్ విద్యార్థులు క్షేత్ర సందర్శనలో స్వీయ అనుభవాన్ని గడించారు.వాస్తవ సమయంలో ఫార్మ్ వర్క్, స్కాఫోల్డింగ్ లపై లోతైన అవగాహనను పొందారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు అమిత్ భట్టాచార్య,తపతి తపస్విత భంజా మార్గదర్శనంలో గీతం స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ ఐదో సెమిస్టర్ విద్యార్థులకు ఈ క్షేత్ర స్థాయి సందర్శనను ఇటీవల నిర్వహించారు. ఫార్మ్ వర్క్ పద్ధతులను స్వయంగా చూడటానికి,ఇందులో ఉన్న భాగాలను అధ్యయనం చేయడంతో పాటు వాస్తవ నిర్మాణ ప్రాజెక్టులలో ఉపయోగించే పద్ధతులను అన్వేషించడానికి ఈ క్షేత్ర సందర్శన విద్యార్థులకు ఒక ప్రత్యేక అవకాశాన్ని కల్పించింది.

కలప,ప్లైవుడ్,లోహంతో సహా వివిధ రకాల ఫార్మ్ వర్కులను విద్యార్థులు పరిశీలించి,నిర్దిష్ట నిర్మాణ అవసరాల ఆధారంగా వాటిని ఎలా ఎంచుకుంటారో తెలుసుకున్నారు.నిర్మాణంలో ఉన్న భవనాన్ని సందర్శించడం ద్వారా విద్యార్థులు సిద్ధాంతం, అభ్యాసం మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించగలిగారు.లోడ్ బదిలీ విధానాలు,మద్దతు వ్యవస్థలు, నిర్మాణ క్రమం వంటి కీలకమైన అంశాలపై వారి అవగాహనను మెరుగుపరచుకున్నారు.ఈ ఆచరణాత్మక అనుభవం తరగతి గది అభ్యాసాన్ని బలోపేతం చేయడమే కాకుండా,భవన నిర్మాణ పరిశ్రమకు అవసరమైన ఖచ్చితత్వం,ప్రణాళిక,సాంకేతిక నైపుణ్యం పట్ల వారి అవగాహనను మరింత పెంచింది.

## విద్యార్థులే లేని ఉన్నత పాఠశాల

**పాఠశాలలో ఉపాధ్యాయుడు ఒక్కడే.....**

**కనపడని మిడ్ డే మీల్స్ వర్కర్స్....**





**సత్తుపల్లి, అక్షిత న్యూస్:** కల్లూరు మండల పరిధిలోని లక్ష్మీపురం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులు లేక ఖాళీగా దర్శనమిచ్చింది. ప్రధాన ఉపాధ్యాయుడు బానోత్ లక్ష్మణ్ ను వివరణ కోరగా గత సంవత్సరం విద్యార్థులు లేక మూసివేసిన పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆదేశాలతో పునః ప్రారంభించారు.దానితోపాటు సెంట్రల్ గవర్నమెంట్ ప్రత్యేక నిధులు కేటాయిస్తున్న గాని అక్కడ విద్యార్థుల కొరత.
ఒకటి నుంచి ఏడు తరగతి అవకాశం ఉన్నప్పటికీ ముగ్గురు విద్యార్థులతోనే తరగతలు కొనసాగిస్తున్నారు. విద్యార్థులు లేకపోవడంతో తరగతి గదులకు తాళాలు వేసిన పరిస్థితి నెలకొంది.ఒక తరగతి గదిలో మాత్రం ఉపాధ్యాయుడు ఉన్నాడు. ఉన్న ముగ్గురు విద్యార్థులలో ఒక్కరు కూడా కనపడని తీరు. ముగ్గురు విద్యార్థులు ఒకటవ తరగతిలో ఇద్దరూ, రెండో తరగతి ఒక్కరు ఉన్నట్టుగా ఉపాధ్యాయుడు తెలిపారు. గతంలో మూసివేసిన తర్వాత పునః ప్రారంభించినప్పుడు 12 మంది విద్యార్థులు ఉన్నారని అనంతరం క్రమంగా తగ్గుతూ చివరికి ముగ్గురు మాత్రమే మిగిలారని తెలిపారు. పెరిగిన విద్యార్థులు ఎందుకు తగ్గారనే విచారణ లేదు.ఆ ముగ్గురు విద్యార్థులతో ఉన్నత పాఠశాల నిర్వహిస్తున్నారు. పిల్లలకు మధ్యాహ్నం భోజనం వండి పెట్టాల్సిన మిడ్ డే మిల్స్ వర్కర్స్ కనిపించకపోవడం పాఠశాలలో నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనబడుతుంది. ప్రభుత్వం అన్ని విధాలుగా విద్యార్థులకు పౌష్టికాహారం అందించే దిశగా అడుగులు వేస్తూ మెస్ చార్జీలు పెంచి ప్రభుత్వ ధనాన్ని పాఠశాలకు వెచ్చిస్తుంటే ఇక్కడ మాత్రం ఈ పాఠశాలలో మిడ్ డే మిల్స్ పిల్లలకు అందుతున్నట్లు లేదని స్థానికులు తెలిపారు. విద్యార్థులు పాఠశాలలో లేకున్న ఉపాధ్యాయుడు పాఠశాలకు హాజరు కావడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ప్రభుత్వ బడులపై ఉన్న అధికారులు దృష్టి సారించి పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని, విద్యార్థుల సంఖ్యను పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.